కథ

# పెళ్ళంటే ఇదీ

డా|| మానేపల్లి

కూతురు స్రవంతి బికామ్ పాసయ్యి మానేసింది. కొడుకుసురేష్‌కి పోలియో. వాడు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్ ఎస్సీ ఫిజిక్స్ చదువుతున్నాడు. ఇల్లు కట్టేడు ప్రమోషన్ వచ్చాక, ఆ కోలనీలో అదికాస్త పెద్ద ఇల్లే. ఇంటి ముందు- కె.సీతారామచంద్రమూర్తి, ఎం.ఏ. అని బోర్డు- తెలుగులోనే- వుంటుంది. ఎపార్ట్‌మెంట్‌కాదు, విశాలంగా డబుల్ బెడ్‌రూం ఇల్లు - చుట్టూ కాస్త కాళీ- ఇంటివెనక నాలుగు కొబ్బరిచెట్లు - ఇంటి ముందు స్థలం కొనేసరికే ఉన్నవేపచెట్టు - పక్కనే జీపు పెట్టుకోవడానికి స్థలం.

కె. సీతారామచంద్రమూర్తిని అంతా సీతారాం అనే పిలుస్తారు. తండ్రిది రాజాంటౌన్. స్వర్ణ కారుడు ఈ మధ్యనే మరణించాడు. పెద్దకొడుకు సత్యలింగం. తండ్రిలాగే బంగారం పని చేసుకుంటున్నాడు. రెండోవాడు సీతారాం, చివర్న ఆడపిల్ల- అనకాపల్లి ఇచ్చారు. ఆ చివర ఒక మగ పిల్లవాడు పుట్టి- చిన్నవయసులోనే గాలిసోకి, బాలారిష్టం వచ్చి చచ్చిపోయాడు. పిత్రార్జితం ఒక పెద్ద పెంకుటిల్లు- రెండెకరాల పొలం. సీతారాంకి రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చి- వేరు వచ్చేశాడు. రాజాంలోపిత్రార్జితం పెంకుటింట్లో అన్నగారుంటున్నాడు. పక్క వాటా చిన్నదే అద్దెకిచ్చేశారు.

సీతారాంకి ప్రమోషన్ వస్తుందనగా సుగర్ వ్యాధి వచ్చింది. ఆ తరువాత తహసీల్‌దారుగా ప్రమోషన్ వచ్చింది. అప్పటికే చీపురు పల్లిలో ఇల్లు కట్టేడు. భార్య సూర్యకాంతానిది అనకాపల్లే. ఆనాడు ఎస్.ఎస్.ఎల్.సీ .పాసయ్యింది. పెళ్లినాటికే సీతారాం బి.ఏ. కంపార్ట్‌మెంట్‌లో పాసయ్యాడు. తరవాత ఎం.ఎ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ చేశాడు. థర్డ్ క్లాసు వచ్చింది. అందువల్ల లెక్చరర్ అవ్వుదామన్న కోరిక తీరలేదు. ఏవేవో రకరకాల డిపార్ట్‌మెంట్ టెస్టులు పూర్తిచేసి,రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పన్నెండేళ్లు చేసి - పాలకొండలో తాసిల్దారయ్యాడు, అయితే అక్కడ ఎక్కువకాలం చెయ్యలేదు.తెలిసిన ఎం.పీ-మరియు మాజీ మంత్రిగార్ని పట్టుకుని- మళ్లీ చీపురుపల్లి వచ్చేశాడు.

స్రవంతి తెలివైంది. చురుకయింది. బి.కాం చదివి ఆపేసింది. ఇకనేను చదవనంది. ఖాళీగా లేకుండా కంప్యూటర్ నేర్చుకుంటున్నది.సీతారాం బావ వీరబ్రహ్మం- ఒకరోజు స్రవంతికి పెళ్ళి సంబంధం తెచ్చాడు. కుర్రాడు ఎం.ఏ ఎంఫిల్,. కాకినాడ పిజీ సెంటర్‌లో లెక్చరర్, వాళ్ళ పూర్వీకులది- పాయకారావు పేట, తండ్రి ఇప్పటికీ బంగారపు పనే చేస్తున్నాడు. బాగా స్తితి పరుడు. ప్రకాష్- ఒక్కగానొక్క కొడుకు, బాగా చదువుకున్నాడు, పెళ్లిచూపుల్లో స్వాతిని చూసి వచ్చాడు. కాగా పిల్ల గ్రాడ్యుయేట్. స్వర్ణకారుల ఆడపిల్లల్లో ఆ పాటి చదువుకోవడం గొప్పే, వెంటనే ఒప్పేసుకున్నాడు. కట్నం కానుకల పట్టింపు లేదన్నాడు. సీతారాం కూడా సంతోషించాడు, కట్నం సమస్య వీరబ్రహ్మమ్ పరిష్కరించాడు. రెండు లక్షల యాభై వేల నగదు, పిల్ల ఒంటి మీద పదితులాల బంగారం. పెళ్ళి చీపురుపల్లిలోనే. పెళ్లి తరవాత- అన్నవరం కొండమీద ఇరుపక్షాలవారు కలసి- సత్యనారాయణ వ్రతం చేయిస్తారు. బట్టలూ, ఉంగరాలూ, స్టీలు సామాన్లూ, ఫ్రిజ్, గ్యాస్ పొయ్యి, కుక్కర్ గ్రైయిండర్ వాటర్ ఫిల్టర్ వగైరా సారె. ప్రస్తుతానికి కాకినాడలో అద్దెయిల్లు, క్రమంగా చిన్నయిల్లు- విడిదిల్లు- కట్టుకోవాలని ఆలోచన. ప్రకాష్ ముందు ఆలోచనతో కట్నం సొమ్ముకి మరొక రెండు లక్షలు కలిపి - చిన్న ఎల్ఐజీ ఇల్లు తీసుకోవాలని ఆలోచిస్తున్నాడు. మంచిదే,ఒక ఇంటివాడయితే ఎవరు మాత్రం సంతోషించరు? ఆపై రెండు లక్షలు తండ్రి యిస్తానన్నాడు. ఉద్యోగంలో చేరిన రెండేళ్ళనుంచీ- కాస్త సొమ్ము వెనక వేస్తూనే ఉన్నాడు, వేరు కాపురానికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి.

పెళ్లి ఏర్పాట్లు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి.

సీతారాం- రాజాం పాలకొండ, చీపురుపల్లి- ఒక పదినెలలపాటు శ్రీకాకుళం ఎం.ఆర్.వో. కార్యాలయంలోనూ వివిధ కేడర్లలో పనిచేసి ఇవ్వాల- తహసీల్దారుగా పనిచేస్తున్నాడు, బాగా వలుకుబడి ఉన్నవాడు. సంపాదనంటారా?అది అనవాయితీగా వస్తున్నదే. లంచం లీగలయిజ్ అయిపోయింది. అడగనక్కరలేదు ఫలానా పనికి ఫలాని ఇంత అని రేట్లు ఏనాడో ఏర్పడి సజావుగా అమలు జరిగి పోతున్నాయి. కాంగ్రేసనీ తెలుగుదేశం అనీ పార్టీలేగానీ- లంచాలదగ్గర పార్టీలేమిటి? డబ్బుకి కులం లేదు, రాజకీయంలేదు. సీతారాం బాగానే సంపాదించాడు, మరొక ఎనిమిదేళ్ల సర్వీసుంది. కారు కొనాలనుకున్నాడుగాని కొనలేదు. ఇప్పటికే అందరికందరూ అతని సంపాదన హోదా చూసి కళ్లు కుట్టుకుంటున్నారు. సర్కారు వారిచ్చిన జీపు వుండనే వుంది. పెళ్లినాటికి అరడజను కార్లు రానే వస్తాయి. బంధు మిత్రులు ఉండనే ఉన్నారు.

ఇకనేం కావాలి!

వారం రోజులు ముందే వీధి వీధి యావత్తూ పందిరి వేశారు. కళ్యాణ మండపం బుక్ చేశారు. డెకరేషన్, బ్యాండుమేళం, ఆర్కెస్ట్రా దానికే లక్ష రూపాయల అంచనా. భోజనాలకి మరొక లక్ష. పెళ్లికి వచ్చిన ముత్తయిదువులందరికీ- బట్టలు. ద్వారపూడి నుంచి ప్రత్యేకంగా వంటవాళ్లొచ్చారు. పెళ్లికి పురోహితులూ- విశ్వబ్రాహ్మనులే. గంగాధరసిద్ధాంతి అని బాగా పేరు మోసిన వాడు, ఆయన ఆయుర్వేద వైద్యుడూ ధన్వంతరీ కూడాను. జాతకాలు, లగ్నాలూ, ముహూర్తాల్లో దిట్ట. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లోనూ మంచి పేరున్న వాడు, ఆయనకి ముగ్గురు ఆడ పిల్లలు. ఆఖర్ని ఒక కొడుకు పుట్టి పోయేడు. ఇంట్లో పనులకు బంధువుల్లో పెద్ద ముత్తయిదువుల్ని తెప్పించారు, మూడుళ్ల నుంచి తలయారీలువారం రోజులుగా ఇక్కడే ఉన్నారు.

ఆ ఏర్పాట్లుచూసి ప్రతివాళ్లూ ఆహా- ఓహో అనేవాళ్లే. చీకటిపడేసరికి పందిట్లో రంగురంగుల దీప తోరణాలు కన్నుల పండువగా వున్నాయి. రవిరాజా లాడ్జింగ్‌లో -పది ఏసీరూంలు బుక్ చేశారు మందు అలవాటున్న బంధుమిత్రులకు ఆ ఏర్పాట్లు కూడా ఉన్నాయి. అయితే పైకి అల్లరి జరక్కుండా ఈ ఏర్పాట్లన్నీ చూడమని - ఒక జూనియర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. అతనికి లోకల్‌గా బాగా పట్టుంది.

పిండివంటలకి లోటులేదు. కాఫీ టీ బోర్నవిటా సిగరెట్లు కిళ్లీలు,ఫలహారాలు- అన్నీ- చిటికెలో వచ్చివాళ్లో వాలతాయి. రికార్డింగ్ డాన్సు కూడా ఏర్పాటుచేద్దాం అనుకున్నారుగాని- ఎందుకో పస్తాయించారు. తునినుంచి ఆర్కెస్ట్రా రానేవచ్చింది. కళ్లు మిరుమిట్లు గొల్పే నలుగురమ్మాయిలు సిద్ధం. పెళ్లినాటిరాత్రి మ్యూజికల్ నైట్. ముహూర్తం రాత్రి 8 గం॥48 ని॥లకి 9.30 నుంచీ ఇక ఆర్కెస్ట్రా- మీ ఓపికే. తెల్లవార్లూ రెడీ.

పద్మినీ ప్రిమియర్ కారును అలంకరించారు.

పెళ్లికూతుర్ని చేశారు. తరవాత వ్రదానం, వడుగు, అన్ని సక్రమంగానూ, ఘనాతి ఘనంగానూ జరిగిపోయాయి. పెళ్లిభోజనాలు సంగతి చెప్పనే అక్కర్లేదు, పిండి వంటలు, జిలేబీలు, లడ్డులు, ఖాజాలు- పకోడీలు, బూరెలు, పులిహోర, గడ్డ పెరుగు, ఐస్‌క్రీమ్, చక్కర కేళీ అరటి పండు- మిఠాయి కిళ్లీ- ఓహ్- తినగలవాడికి తిన్నంతాను. తినలేక పదార్థాలు ఆకుల్లో వదిలేసే వాళ్లేఎక్కువ.

కట్నం సొమ్ము ముందుగానే పెద్దమనుషుల సమక్షంలో ఇచ్చేశారు. పెళ్ళి కూతురికి చంద్రహారం, చేతికి నాలుగేసిమిరియం గాజులు ,రెండు రకాల చెవి రింగులు, ఉంగరాలు- పెళ్లికొడుక్కి, బిగినీ గొలుసు,ఉంగరాలు,వాచీకి బంగారవు చెయిను- ఖరీదయిన నాలుగుసూట్లు.

సుముహూర్తానికి పెళ్లి- మంగళ సూత్ర ధారణ జరిగిపోయింది, మంత్ర తంత్రాలు,మంగళ వాయిద్యాలు - భూనభోంతరాళాలు దద్దరిల్లి పోయాయి, అంతా వీడియోలో చిత్రీకరించారు. కెమెరాలకి లెక్కేలేదు. ఆశీర్వచనాలూ, చదివింపులూ, గ్రూపు ఫోటోలు చెప్పనక్కరలేదు-

నరిగ్గా -ముహూర్తానికి వచ్చి-తనకి తోచింది. ఒక కవరులోపెట్టి ఇచ్చి ఏదో ఒకటని -వెళ్లిపోయాడు నత్యమూర్తి. సీతారాంకి దగ్గరబంధువు.

ప్రొఫెసర్ సత్యమూర్తి ఆంధ్రా యూని వర్సిటీలో- ఇంగ్లీసు ప్రొఫెసర్ గా చేసి రిటయిర య్యాడు. తెలుగు కథల ఇంగ్లీషు అనువాదం - పెంగ్విన్ ఇండియా వాళ్లు వేశారు. ఒక కథల సంపుటి వికాస్ పబ్లిషర్లు వేశారు, ఒక చిన్న కవితా సంపుటి ( కొన్ని తెలుగు కవుల అనువాదాలు) తనే స్వంత సొమ్ముతో వేసుకున్నాడు,సోల్ డిస్ట్రిబ్యూటర్స్ రూపా అండ్‌కో, కొన్ని సాహిత్య వ్యాసాలు-రూపా అండ్‌కో వాళ్ళే ఒక పుస్తకంగా వేస్తారు, శ్రీలంకలో కొలంబో - నేపాల్‌లో ఖాట్మండ్, కరాచీ-మొదలైన చోట్ల -విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశాడు. యుజిసి స్పాన్సర్‌షిప్ మీద ఇంగ్లండులో రెండు వారాలుండి, తిరిగి వస్తూ పారిస్‌లో మూడు రోజులుండి వచ్చాడు. మొన్న ఏప్రిల్ 1 వ తేదీన రిటయిరయ్యాడు, శిష్యులు మిత్రులు,రిసెర్చి స్కాలర్లు, పాత్రికేయులు సన్మానం చెయ్యబోతే వద్దన్నారు, వాళ్లు రూపా అండ్‌కో వాళ్లు వెయ్యబోయే సాహిత్య వ్యాససంపుటికి- పాతికవేల రూపాయల చెక్కు విరాళంగా ఆర్థిక సహకారంగా ఇచ్చారు. విశాఖ పట్నంలో ఆరేళ్లక్రితం కొన్న సైట్ అమ్మేసి - ఎలమంచిలిలో ఒక ఇల్లు కట్టుకున్నాడు, కింద డబల్ బెడ్ రూం- గెస్ట్‌రూం- ఒకహాలు వగైరాకాక- మేడమీద పెద్దహాలు-ఇద్దరు కూతుళ్లు. పెద్దమ్మాయి సుచిత్ర ఎమ్‌ఎస్‌సి కెమిస్ట్రీ, రెండో అమ్మాయి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం. సీతారాం - సత్యమూర్తికి కజిన్‌వరస, చాలాకాలంగా పరిచయస్తుడు. ఎంఏ పూర్తిచేసి రీసెర్చి స్కాలర్‌గా వుంటున్న రోజుల్లో- ఎమర్జెన్సీలో అరెస్టయి సంవత్సరన్నర పాటు జైలుజీవితం గడిపి వచ్చాడు. విప్లవ రచయితల సంఘంలోనూ, పౌరహక్కుల సంఘంలోనూ- క్రియాశీల సభ్యుడు. రెండేళ్లక్రితం పాడేరు సమీపం, గంగరాయి మాడుగుల మండలం వాకపల్లి గిరిజన స్త్రీలపై పోలీసు దళాల రేప్ కేసు విషయంలో - డియస్‌పితో ఘర్షణ పడి అరెస్టయ్యాడు. వారం తరవాత విడుదల య్యాడు. ఆ కేసు నిన్నటిదాకా కోర్టులో ఈడిచింది. చివరికి- రిటయిరయిన వారంలోనే కేసుకొట్టేశారు.

సుచిత్ర పెళ్లి-కుర్రాడు పరిచయస్తుడే, ఇంజనీరింగ్ పూర్తిచేసి ఒక ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు రామకృష్ణ. అతనికి సుచిత్ర నచ్చింది, అయితే అతను ఎస్.సి. చాలా కష్టపడి స్కాలర్ షిప్పుల మీద, అప్పులు చేసి చదువుకున్నాడు. తండ్రి వ్యవసాయ కూలి. ఎకరం మెట్టవుంది. కూరగాయలు వేస్తారు. రామకృష్ణ తరువాత ముగ్గురు ఆడ పిల్లలు. రామకృష్ణ తండ్రికి పిత్రార్జితం పెంకుటిల్లు నర్సీపట్నంలో. అతనితో సుబద్రకి పెళ్లి ఖాయం అయింది. సత్యమూర్తి భార్యకి - అంటే సుచిత్ర తల్లికి- ఈ పెళ్లి సుతారమూ ఇష్టంలేదు, ఎంత ఆదర్శం, కులాంతరం అయితే మాత్రం- మాలకూడు తింటామా అని ఆమె ఒకటే గోలగోల- కన్నీటి వరద- వలవలవల- సత్యమూర్తిది మొండి పట్టుదల- ఒకమంచి పని చేస్తున్న ప్పుడు కొంత ఘర్షణ తప్పదు- ఆ ఘర్షణను ఎదుర్కొనే సత్తావుండాలి-



హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో అమీమ్ రచించిన 'ప్రేమ కెరటాలు' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి, చిత్రంలో రఘుశ్రీ, కిరణ్‌బాబు, షమీమ్, వై.ఎస్. వివేకానందరెడ్డి, డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు, సలీం, శైలజామిత్రలు ఉన్నారు.

అంటాడు.

మంచిరోజులు కాకపోగా మూఢం- ముహూర్తం లేదు- కాగా- శుభలేఖ ల్లేవు- కరపత్రాలు షామియానా లేదు- మామిడి తోరణాల్లేవు- పందిరిరాట గోదుమ రాటు అరిటాకు లేదు- పెళ్లి పీనేలేదు -పురోహితుడులేదు.

జూన్ నెలలో - సెకండ్ సాటర్‌డే పగలు పది గంటలకు- సభాప్రారంభం- అధ్యక్షుడు నాస్తిక సమాజం రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామకృష్ణగారు - నిర్వహణ జయగోపాల్ నూకరాజు, కృష్ణారావు, శ్రీరామ్మూర్తిగారు మరికొందరుస్థానికకార్య కర్తలు- మంగళ వాద్యాలు లేవు- వంగపండు పాటలు- గద్దర్ పాటలు- వంగపండుఉషబృందం వస్తున్నది- మహా అయితే ఒక వందమంది వుండొచ్చు. డిగ్రీ కాలేజి మేడమీద కొత్తగా కట్టిన పెద్ద సెమినార్ హాలు వేదిక- ఆ లోపల అలంకారం అదీ ఏమీలేదు. వేదిక దగ్గిర పెద్ద పొడవుబల్ల దానిమీద పువ్వుల దుప్పటి- గోడకి- జ్యోతిరావ్‌పులే హాలు అని బ్యానర్ -ఇంతే. పదిగంటలకి కార్యక్రమం ప్రారంభ మయ్యింది. రామకృష్ణగారు- వధూవరులచేత ప్రతిజ్ఞలు చదివించారు. దండలు మార్పించారు. నిజానికి ఈ దండల మార్పిడి కార్యక్రమం సత్యమూర్తికిగాని -అటు పెళ్లికొడుకు రామకృష్ణకి గాని ఇష్టంలేదు.కాని నలుగురూ అమాత్రం దండలయినా లేకపోతే ఎలా అంటే చాలా సింపుల్‌గా దండల మార్పిడి కానిచ్చారు. జయగోపాల్, శ్రీరామ్మూర్తి మొదలైనవారు ప్రసంగించారు. మధ్యలో బిస్కట్లు, టీలు వచ్చాయి.వంగపండు ఉష పాటలు పాడింది. పులిలాగర్జించి చిందులు వేసింది. రారనుకున్న వాళ్లు ఆఖరి క్షణంలో విజయవాడ నుంచి లవణం, సమరం, విజయం- వచ్చి సందేశాలు వినిపించారు. ఇంచుమించు ఒంటిగంట వరకు కార్యక్రమం సాగింది.పెళ్లిపెద్దలూ చెయ్యొచ్చు, పిల్లలూ చేసుకోవచ్చు. సమాన ప్రాతిపదిక, పరస్పర అవగాహన ముఖ్యం.

రామకృష్ణ కులం ఎస్.సి. అనిమాత్రం తెలుసుగాని వివరాలు తెలీదు సుచిత్ర తల్లికి. ఈ పెళ్లిలో నలుగురి మాటల్లోనూ అతను మాదిగ కులస్తుడని తెలిసింది. దాంతో ఇంకా వెర్రెక్కి పోయింది.ఏంచేస్తుంది. విసవిసలాడుతూ మెట్లు దిగిపోయి - ఇంటికి వెళ్లి కళ్లనీళ్లు పెట్టుకు కూచుంది. బీపీ వచ్చేసింది.దాంతో జ్వరం వచ్చేసింది. వళ్ల మాలిన తలనెప్పి. సుచిత్ర చాలా నొచ్చుకుంది. ఈ సంగతి తెలుసుకుని రామకృష్ణ కూడా బాధపడ్డాడు. తిన్నగా సుచిత్ర తల్లి దగ్గరకు వెళ్లి- క్షమించమని వేడుకున్నాడు. మీకు నిజంగా అంతయిష్టం లేనప్పుడు, మీ మనసు కష్టపెట్టి పెళ్లి చేసుకోవడం తగదు గనక-రద్దుచేసుకుందాం అన్నాడు. ఆ అబ్బాయి అంతలా ప్రాధేయ పడుతుంటే- ఆమెకి కూడా మనసు కష్టం వేసింది. అయ్యో అనిపించింది. ఈ కులాలు కల్పితాలు అని తెలిసినా నమ్మశక్యం కావడంలేదు.పెద్దలు కులం అనీ వంశం అనీ ఎందుకు పెట్టారు? అసలు కులమే లేదు పొమ్మంటే ఎలా? ఆమె కూడా చాలా మథన పడింది.సత్య మూర్తి అలా చూస్తూ తొణక్కుండా నిబ్బరంగా వుండిపోయాడు.

ఈ పెళ్లికి సత్యమూర్తి తరపున కులస్తులు బహుతక్కువ మంది వచ్చారు. రామకృష్ణ తరపు బాగానే వచ్చారు. రామకృష్ణ ఐదడుగుల పదకొండు అంగుళాల మనిషి. ఎరుపుకి దగ్గిరగా వుండే చామనచాయ. బాగా చదువూ నంస్కారం ఉన్నవాడు. కులం గురించి ఎవరికి కావాలి. ఎవరికీ ఆ విషయం పెద్దగా పట్టనేలేదు, రెండు నెలల క్రితం స్రవంతికి జరిగిన అట్టహాసమైన పెళ్ళికీ దీనికీ ఎంత తేడా ! ఆపెళ్లికి పాతిక లక్షలు ఖర్చయితే ఈ పెళ్ళికి పాతికవేలు ఖర్చయి వుండదు.పెళ్లి భోజనాలు కూడాచాలా సాదాగా వున్నాయి. కనీసం లైటింగ్ లేదు- ఆర్కెస్ట్రా లేదు. కాగా ఉష పాటలు, విప్లవ గీతాలు. అవి నక్సలైటు పాటలట!

ఎర్రజెండెర్రజెండెన్నియ్యల్లో

ఎర్రెర్రనిదీజెండెన్నియల్లో- అని ఉరికింది.

యంత్రమెట్టా నడుస్తు వుందంటే-పాడింది

దళిత పులులం - అని బృందగానం చేసింది

అందరి మనసులూ ఎంతో ఉత్తేజంతో వురకలు వేశాయి

స్రవంతి పెళ్లీ పెళ్ళే

సుచిత్ర పెళ్లీ పెళ్ళే. ఎంత తేడా. ఆ పెళ్లి- ఈ పెళ్లి- బేరీజు వేసి చూశారు కొందరు.

అయితే - కులాంతర వివాహాలు జరిగితే కులనిర్మూలన సాధ్యమా? ఏమీ సాధ్యంకాక పోవచ్చు, కాని అది ఒక సాధనం. ఆర్థిక అంతరాలు పోవాలి. దోపిడీ భావజాలం నశించాలి. సాంఘిక సమానత రావాలి. ఇదంతా చాలా దీర్ఘ కాలిక ప్రక్రియ. అందులో కుల రహిత వివాహం- ఒక లింకు, అసలు పాకిస్తాన్‌లో పెళ్లికి ఆర్భాటం పనికి రాదట. కరంటు వాడకంపై పరిమితి వుందట. మంచిదే చూసిన యువతరం - రేపు తాము ఇలాంటి పెళ్లే చేసుకోవాలనుకున్నారు.పెళ్లి రెండు వ్యక్తుల, కుటుంబాల, భావజాలాల కలయిక,దానికి అంత అట్టహాసం, ఖర్చు, ఆర్భాటం అవసరంలేదు.

# హనుమాన్ నానీలు

యం. హనుమాన్ రాజు

రక్త సంబంధం
ప్రవహించే రక్తం ఒక్కటే.
జీవనమే
తూర్పు పడమరలు.

కాకుల రొదలో
కోకిల గానం గాయమైంది.
వాస్తవం
నివ్వెరపోయింది

మగ
రాక్షసులెక్కువే.
పీలిక వస్త్రాలతో
రెచ్చగొట్టే సూర్పణకలుంటే.